'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

రాజకీయ పార్టీలకు ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలే కీలకం. ఆయా పార్టీలు విడుదల చేసే మ్యానిఫెస్టోలే ప్రధానం. కానీ ఓట్లడిగేటప్పుడు వందల కొద్దీ హామీలివ్వడం, తీరా ఆ ఓట్లతో గెలిచి ఆ హామీలను పక్కనపెట్టే పాడు సంస్కృతి దశాబ్దాలుగా చూసిన తెలంగాణ జనం ప్రస్తుతం ఆచరణ-ఆమోదం అనే రెండు పదాలనే చూస్తున్నారు. గతంలో అలవికాని హామీలను చూసి చూసి అలసిపోయిన జనం ఎన్నికలప్పుడు కాంగ్రెస్, బీజేపీ లాంటి పార్టీలు విడుదల చేసే మ్యానిఫెస్టోలకు విలువివ్వడమే మానేసారు.

మ్యానిఫెస్టోతో ఆత్మస్థైర్యం

వెంకట్ గుంటిపల్లి
94949 41001



కాంగ్రెస్ పార్టీ 2018లో అలవికాని హామీలతో మ్యానిఫెస్టో విడుదల చేసి ఓట్లు పొందాలని నానా తంటాలు పడి చేతులు కాల్చుకున్నది.అనేక సాధ్యం కాని హామీలిచ్చినా, పెన్షన్లు పెంచుతామన్నా, రైతు రుణ మాఫీ రూ.2లక్షలు అని చెప్పినా జనం నమ్మలేదు. మళ్లీ ఇప్పుడు ఎలాగైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ ఉచితానుచితాలను మరింత పెంచి ప్రజలకు ఎర వేయాలని చూస్తున్నది. లోగడ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలకు, ఇటీవల ప్రకటించిన డిక్లరేషన్లకు ఇవాళ తెలంగాణ భవన్ వేదికగా సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోకు తేడా చూస్తే నక్కకు నాగలోకానికి ఉన్నంత కనిపిస్తుంది. మ్యానిఫెస్టో విడుదల చేస్తూ సీఎం కేసీఆర్ గత పదేండ్లలో ఏం చేశారో చెప్పారు. అలాగే వచ్చే ఐదేండ్లలో ఏం చేస్తారో... ఎంత చేస్తారో క్లారిటీ ఇచ్చారు. గతంలో నెరవేర్చిన హామీలు, అమలు చేస్తున్న కొత్త పథకాలు, ప్రస్తుతం ఇచ్చిన హామీలను కలిపి వచ్చే ఐదేండ్లలో అమలు చేసే సామర్థ్యం బీఆర్ఎస్‌కు మాత్రమేనని వివరించారు.

తెలంగాణలో పదేండ్లుగా సుస్థిర ప్రభుత్వాన్ని నిర్మించుకుని రాజకీయ సాధికారత, ఆర్థిక స్వావలంబనతో ముందుకు సాగుతూ సంక్షేమంలో దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోన్న బీఆర్ఎస్ విడుదల చేసిన మ్యానిఫెస్టో అన్ని వర్గాల మెప్పు పొందుతున్నదని చెప్పాలి. స్వీయ పాలనలో సంస్కరణలు చేపట్టి అన్ని వర్గాలకు విధానాల రూపంలో లబ్ధి చేస్తున్న తీరును మ్యానిఫెస్టో విడుదల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి వివరించిన తీరు అద్భుతం. అంటే ఒక పార్టీ నాయకుడు ఆ ప్రభుత్వాన్ని నడుపుతున్న తీరు, తన ప్రజలకు కావాల్సిన అవసరాలు, హామీల గురించి వివరంగా చెప్పారు.

కాంగ్రెస్ ఏలుబడిలోని అరవైఏండ్లలో, బీజేపీ పాలనలోని పదేండ్లలో దేశం, రాష్ట్రాల పరిస్థితిని గమనంలోకి తీసుకుంటే అనేక ఎన్నికల్లో హామీలిచ్చి, మ్యానిఫెస్టోలను విడుదల చేసి ప్రజల చిత్కారాలకు ఆ పార్టీలు గురైన సందర్భాలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల నుండి, ఉద్యమ ఆకాంక్షల నుండి పురుడుపోసుకున్న భారత రాష్ట్ర సమితి రెండు సార్లు విజయం సాధించి మూడోసారి పరీక్షను నెగ్గబోతోంది. గతంలో రెండు సార్లు ప్రకటించిన మ్యానిఫెస్టోలను పరిశీలిస్తే నూటికి నూరు శాతం ఆ హామీలను నేరవేర్చుతూనే లెక్కలేనన్ని కొత్త పథకాలను ప్రవేశపెట్టి జనం మదిని గెలిచింది. విజయవంతమైన గత హామీలనే ఈ సారి మరింత పెంచుతూ ఆర్థిక భరోసా ఇచ్చింది. దేశంలో రైతు బంధు సాయాన్ని అమలు చేస్తున్నది ఒక్క తెలంగాణ ప్రభుత్వమే. రైతుబంధు కింద ఇస్తున్న పంట పెట్టుబడి సాయం ఎకరానికి ఏటా రూ.10,000. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే దాన్ని మొదటి సంవత్సరంలో ఎకరానికి ఏటా రూ. 12,000గాను, వచ్చే ఐదేండ్లలో క్రమంగా పెంచుతూ.. గరిష్టంగా ఎకరానికి ఏటా రూ.16,000లకు పెంచుతామని చెప్పారు. ఎలాంటి దళారులు, పైరవీలు లేకుండా ప్రజలకు నేరుగా అందచేస్తున్న ఈ పథకం గత ఏడేండ్లుగా విజయవంతంగా అమలవుతున్నది. వచ్చే ఐదేండ్లలో ఈ పెట్టుబడి సాయాన్ని పెంచుతూ తీసుకున్న నిర్ణయం ముదావహం.

బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం ఇస్తామని కూడా చెప్పారు. గత పదేండ్లలో హాస్టళ్లు, వివిధ వసతి గృహాలకు సన్నబియ్యం పంపిణీ చేసి నాణ్యమైన భోజనం అందించిన కేసీఆర్ సర్కారు ఇప్పుడు ఇంటింటా సన్న బియ్యం పంపిణీ చేపట్టడం రాష్ట్ర ప్రగతికి, ఆత్మ విశ్వాసానికి తార్కాణమని చెప్పాలి. పేదలకు ఆరోగ్య బీమా కోసం తెల్లకార్డు కలిగిఉన్న ప్రతి పేద ఇంటికి రైతు బీమా తరహాలోనే ఎల్ఐసీ ద్వారా రూ. 5 లక్షల జీవితబీమాను ప్రకటించి చరిత్ర సృష్టించారు. ఆసరా పెన్షన్లను ఐదేండ్లలో రూ 5,016కు, ఇటీవలేరూ.4,016కు పెంచిన దివ్యాంగుల పింఛన్‌ను రాబోయే ఐదేళ్లలో రూ. 6,016కు పెంచుతామన్న ప్రకటన ఆ వర్గాల్లో మరింత ఆత్మస్థైర్యం నింపింది. అర్హులైన పేద మహిళలందరికీ ప్రతినెలా రూ. 3,000 జీవన భృతిని అందిస్తామని, అర్హులైన పేద మహిళలకు, అక్రిడిటేషన్ గల జర్నలిస్టులకు రూ.400కే గ్యాస్ సిలిండరు అందిస్తామని చెప్పారు. ప్రస్తుతం రూ.5 లక్షలుగా ఉన్న ఆరోగ్యశ్రీ గరిష్ట పరిమితిని రూ.15 లక్షలకు పెంచుతామని హామీ ఇవ్వడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఇలా చెప్పుకుంటే పోతే కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టో ఎన్నికల హామీల దిశగా కాకుండా పేద బడుగు బలహీనవర్గాల్లో ఆత్మస్థైర్యం పెంపొందించే దిశగా ఉన్నదని చెప్పాలి.

ఉచితాలు బద్ధకస్తుల్ని చేయవు!

బుద్ధా మురళి
98499 98087

పేదల కోసం ఉచిత పథకాలను తమ ఎన్నికల ప్రణాళికలో ఏదైనా పార్టీ ప్రకటించినా లేదా ఏదైనా ప్రభుత్వం అమలు చేసినా సాధారణంగా వినిపించే మాట 'ఈ పథకాలతో బద్ధకస్తులను తయారు చేస్తున్నారు' అని. నిజంగా ఉచిత పథకాలు బద్ధకస్తులను తయారు చేస్తాయా? అని ప్రశ్నించుకుంటే..'ఉచిత పథకాలు బద్ధకస్తులను తయారు చేయవు, కుటుంబాల ఆదాయాన్ని పెంచుతాయి తద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచుతాయి.' అని సమాధానం వస్తుంది. అదెలాగో చూద్దాం.



ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడిన ప్పటి నుంచి పేదలకు ఉపయోగ పడే ఉచిత పథకాలు ఎన్నో ప్రవేశ పెట్టింది. దేశంలో పలు రాష్ట్రాలు ఈ పథకాలను అనుసరిస్తున్నాయి కూడా. చివరకు కేంద్రం కూడా రైతు బంధు, ఇంటింటికీ తాగునీరు (మిషన్ భగీరథ) పథకాలను కాపీ కొట్టి దేశమంతా అమలు చేస్తోంది. రైతు బంధు పథకంతో రైతులు బద్ధకంగా తయారయ్యారా? లేదే! ప్రస్తుతం దేశంలో అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ. ఉచిత పథకాలు బద్ధకస్తులను తయారు చేస్తే దేశానికి అన్నం పెట్టే స్థాయిలో ధాన్యం ఎలా ఉత్పత్తి అవుతుంది? తెలంగాణలో దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం నమోదు అయింది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఉచిత పథకాలు అమలు చేస్తున్నారు. ఈ పథకాల వల్ల బద్ధకస్తులు తయారయితే దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం తెలంగాణలో ఎలా వస్తుంది? రాష్ట్ర ఆదాయం ఏటేటా పెరుగుతూనే ఉంది కానీ తగ్గడం లేదు కదా? కరోనాను సైతం తట్టుకొని రాష్ట్రం నిలబడింది. ఆదాయం పెరుగుతూ ఉంది. ఉచిత పథకాలపై విమర్శలు చేసేవారి ఆలోచనలు తప్పు అని రుజువు అయినట్టే కదా.

దళిత బంధు ద్వారా బాగుపడ్డ ఓ కుటుంబాన్ని ఓ రైతు మిత్రుడు యూట్యూబ్‌లో పరిచయం చేశాడు. ఆ వీడియోలో చూస్తే.. దళిత బంధు ద్వారా ప్రభుత్వం ఇచ్చిన పది లక్షలతో ఏడు బర్రెలు కొని పాల వ్యాపారం చేస్తూ, ఏడాదిలో వచ్చిన ఆదాయంతో మరిన్ని ఆవులు కొన్నదా కుటుంబం. కుటుంబం మొత్తం పనిలో ఉంది. దళిత బంధు ద్వారా ఆ కుటుంబం బద్ధకస్తులుగా మారలేదు. మొత్తం కుటుంబం ఉపాధి పొందడమే కాదు తాము సంపాదించిన డబ్బుతో ఇంటి అవసరాలకు వస్తువులు కొన్నప్పుడు ఆటోమేటిక్‌గా ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం వస్తుంది.

పేదరికం వల్ల ఆరవ తరగతి నుంచే చదువు మానేసిన నా బాల్యమిత్రుడు గౌడ్. తాను కల్లు దుకాణంలో పని చేసినా చదువు విలువ తెలుసుకొని ముగ్గురు ఆడపిల్లలను ఇంజనీరింగ్ చదివించాడు. ఆరేళ్ళ క్రితం బీసీలకు కూడా విదేశీ విద్యా పథకం వస్తే వానికి చెప్పాను. ఏదో చూద్దాంలే అని దరఖాస్తు చేశాడు కానీ వస్తుంది అని నమ్మకం ఏమాత్రం లేదు. రూ.20 లక్షలు మంజూరు అయ్యాయి. అంత పెద్ద మొత్తం తన ఖాతాలో చూడడం అతనికి అదే మొదటి సారి. 'ఇంతేసి డబ్బు ప్రభుత్వం నాకెందుకు ఇచ్చింది? ప్రభుత్వానికి ఏం లాభం?' అంటూ ఆ మిత్రుడు ఆశ్చర్య పోయి చాలా సేపు చర్చించాడు.

'ఇలాంటి పథకాల వల్ల వ్యక్తిగతంగా మీ కుటుంబం ప్రయోజనం పొందడమే కాదు, రాష్ట్రానికి కూడా ప్రయోజనం. ఒక కుటుంబం బాగు పడాలి అని తల్లి తండ్రులు చాలా కష్టపడి పిల్లలను చదివిస్తారు, దీని వల్ల ఆ పిల్లలకు మంచి ఉపాధి లభిస్తే ఆ కుటుంబం బాగుపడుతుంది. మొత్తం రాష్ట్రాన్ని ఓ కుటుంబంగా భావిస్తే, మీ అమ్మాయి చదువు కోసం ప్రభుత్వం 20 లక్షలు ఖర్చు చేసింది. రెండేళ్ల తరువాత మీ అమ్మాయి అమెరికాలో డాలర్లు సంపాదించి పంపిస్తే, ఆ డబ్బుతో నువ్వు మంచి జీవితం గడపడం, ఇల్లు కట్టడం లాంటివి చేస్తావు. నువ్వు ఇల్లు కట్టినా, కొన్నా ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం లభిస్తుంది. ఇలాంటి పథకాల వల్ల రాష్ట్ర ఆదాయం పెరుగుతుంది తప్ప తగ్గదు' అని వివరించాను. ఆరేళ్ళ క్రితం ప్రభుత్వ పథకంతో ఒక అమ్మాయి విదేశాలకు వెళితే, ఆ అమ్మాయి సహకారంతో మిగిలిన ఇద్దరు చెల్లెళ్లు కూడా విదేశాలకు వెళ్లారు. ఇలా విదేశాలకు వెళ్లిన ఎన్నో కుటుంబాలు ఉన్నాయి.

> రాష్ట్ర వ్యాప్తంగా వేలాది చెరువుల్లో చేప పిల్లలు వదిలారు. వీటి వల్ల చెరువులపై ఆధారపడిన వారి ఆర్థిక పరిస్థితి మెరుగు పడింది. అదే విధంగా బర్రెలు, గొర్రెలు పంచారు. వాటి వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఎంత బలపడిందో గ్రామాలకు వెళితే తెలుస్తుంది. తెలంగాణ ఏర్పడక ముందు గ్రామీణ ప్రాంతాల్లో నైరాశ్యం కనిపించేది. రైతుల ఆత్మహత్యలు సర్వసాధారణం. కానీ ఇప్పుడు హైదరాబాద్‌కు వంద కిలో మీటర్ల వరకు ఎకరం కోటి చెబుతున్నారు. ఏ మూలకు వెళ్లినా ఎకరం అరకోటి పలుకుతుంది. ఒక వైపు రైతు బంధు మరో వైపు పాలం విలువ పెరగడంతో రైతుల జీవితాల్లో గొప్ప మార్పు కనిపిస్తోంది.

చివరకు ఇంటికే పరిమితం అయ్యే వృద్ధులకు ఇచ్చే వృద్ధాప్య పెన్షన్ కూడా గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. నెల నెలా రూ.2,016 రావడంతో వారు ఆత్మ విశ్వాసంతో బతుకుతున్నారు. ఆ రెండు వేలతో కిరాణా షాప్‌లో ఏమైనా కొంటారు, మెడికల్ షాప్‌లో మందులు కొంటారు. పెన్షన్లు వచ్చినప్పుడు గ్రామాల్లో ఆ మేరకు అమ్మకాలు, కొనుగోళ్లు పెరుగుతున్నాయి. దాంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత మెరుగు పడుతుంది. రైతు బంధు అమలు తరువాత రైతులు పొలం అమ్మడానికి ఇష్టపడడం లేదు. రైతుల ఆత్మహత్యలు మాయం అయ్యాయి. తెలంగాణలో పదేళ్ల క్రితం గ్రామాలూ ఎలా ఉండేవి, ఇప్పుడు ఎలా ఉన్నాయో చూస్తే ఈ పథకాలు బద్ధకస్తులను తయారు చేస్తున్నాయా? గ్రామాలు, కుటుంబాలు కళకళలాడేట్టు చేస్తున్నాయా? అందరికీ అర్థం అవుతుంది.

గతంలో సిరిసిల్ల ప్రాంతంలో చేనేత కార్మికుల ఆత్మహత్యలు బాధ కలిగించేవి. బతుకమ్మ చీరలు వారి జీవితాలను మార్చేశాయి. బతుకమ్మ చీరల్లో రాజకీయం చూసే వారు చీరలను తగలబెట్టి మురిసిపోవచ్చు కానీ చేనేత కార్మికుల్లో, పేదల్లో ఆ చీరలు కలిగించే ఆనందం చూసే వారికి తెలుస్తుంది.

> పెద్ద పెద్ద పారిశ్రామిక కుటుంబాలకు వేల కోట్ల రూపాయల రుణాలను రైట్ ఆఫ్ చేసిన దేశ పాలకులు సైతం ఉచిత పథకాలను విమర్శిస్తున్నారు. తమకు అందని ఉచిత పథకం ఏదైనా వృథానే అనిపించడం మామూలే కానీ ఉచిత పథకాలు తెలంగాణ గ్రామీణ స్వరూపాన్ని మార్చేశాయి. దళిత బంధు, రైతు బంధు, పెన్షన్లు, చేపలు, బర్లు, గొర్రెలు వంటి ఈ పథకాలన్నీ కూడా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాయి.

ఉమ్మడి రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లాలోని ఓ గ్రామంలో అప్పటి కలెక్టర్ ఇంటింటికీ సురక్షితమైన తాగునీటిని అందించి, కొంత కాలం తరువాత ఆ గ్రామంలో మార్పులపై అధ్యయనం చేయించారు. సురక్షితమైన నీటి వల్ల ఆ గ్రామంలోని కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగు పడింది. ఎలా అంటే అంతకు ముందు తాగునీళ్లు బాగా లేక తరుచుగా రోగాల పాలు అయ్యేవారు. రోగం వచ్చినప్పుడు వైద్యానికి ఖర్చు, దీనికి తోడు కూలీ పనికి డుమ్మా. దానితో ఆదాయం పడిపోయేది. సురక్షితమైన నీటి వల్ల ఆరోగ్యంతో పాటు ఆదాయమూ పెరిగింది. తెలంగాణ వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికీ మంచి నీరు సరఫరా ప్రభావం.. గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయం పెరుగుదలపై ఉంది. మేధావుల విమర్శలు, సన్నాయి నొక్కులు ఎలా ఉన్నా, తెలంగాణ ఆదాయం పెరుగుతూనే ఉంటుంది. మరిన్ని ఉచిత పథకాలు వస్తాయి. మరింత ఆదాయం పెరుగుతుంది. ఇది ఖాయం.

> గతంలో సిరిసిల్ల ప్రాంతంలో చేనేత కార్మికుల ఆత్మహత్యలు బాధ కలిగించేవి. బతుకమ్మ చీరలు వారి జీవితాలను మార్చేశాయి. బతుకమ్మ చీరల్లో రాజకీయం చూసే వారు చీరలను తగలబెట్టి మురిసిపోవచ్చు కానీ చేనేత కార్మికుల్లో, పేదల్లో ఆ చీరలు కలిగించే ఆనందం చూసే వారికి తెలుస్తుంది.

కాంగ్రెస్ మాటలన్నీ నీటి మూటలే

జల విజ్ఞానం లేని అజ్ఞాన ఖనులు • తెలంగాణ గోస ఆ పాలన పుణ్యమే!

డాక్టర్ ఎంపీ శ్రీనివాసన్
81069 35000

తెలంగాణ గురించి ఏమీ తెలియని నడ్డా మొదలు కొత్తగా తెలంగాణ నా మెట్టినిల్లు అని రాజకీయం మొదలుపెట్టిన షర్మిల వరకు అందరూ తెలంగాణ ఉద్యమ ఆశయాల గురించి మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అయితే తెలంగాణకు గ్యారంటీలు అంటూ ఊదరగొడుతున్నారు. ఈ తొమ్మిదేండ్లలో తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు ఒక్కటీ నెరవేరలేదని కాంగ్రెస్ నాయకులు ఊరూరా శోకాలు పెట్టారు. తెలంగాణ ఆకాంక్షలను కేసీఆర్ సమాధి చేశారని దుమ్మెత్తిపోశారు. అంత మాట్లాడారు కాబట్టి కాంగ్రెస్ నాయకులు తుక్కుగూడ వేదికగా నిర్వహించిన సభలో ప్రజలకు ఇచ్చే గ్యారెంటీల్లో ఆ ఆకాంక్షలు ప్రతిఫలిస్తాయని అంతా ఊహించారు. కానీ ఆ గ్యారంటీల్లో ఉద్యమ నినాదాలైన నీళ్లు, నిధులు, నియామకాలకు సంబంధించి ఒక్క పదం కూడా లేదు.

కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీలు చూస్తే తెలంగాణ ఉద్యమం 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ కోసమో, ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం కోసమో జరిగినట్లు కాంగ్రెస్ భావించిందనుకోవాలా? ఇవే తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలని కాంగ్రెస్ అనుకుందనుకోవాలా? రాజు వేషం వేస్తే చాలదు. రాజులాగా ప్రవర్తన కూడా ఉండాలి. తెలంగాణ అంటే చాలదు.. తెలంగాణను అణువణువునా ఆవహించుకోవాలి. ఈ భృత్య కాంగ్రెస్ గణానికి అంత సీనెక్కడిది?

నీళ్ల నిర్వాకం ఒక్కటే చాలు..!

తెలంగాణ ఉద్యమ ఆశయాల్లో మొదటిది నీళ్లు. 1952 నుంచి 2014 వరకు సింహభాగం పాలన సాగించిన కాంగ్రెస్ నీటి పారుదల రంగంలో చేసిన నిర్వాకం గురించి చెప్పుకోకపోతే తెలంగాణ ఉద్యమ సమయం నుంచి ఇప్పటివరకు తెలంగాణ కాంగ్రెస్ ధోరణి అర్థం కాదు. ఏపీ ఏర్పడకముందు తెలంగాణలో గంగాళాల వలె ఉన్న చెరువులు సమైక్య రాష్ట్రంలో తాంబాళాల్లా మారిపోయాయి. నిజాం రాజ్యంలో నిర్ణయించిన ప్రాజెక్టులు ఆగిపోయాయి. పెద్ద మనుషుల ఒప్పందంలో నీటిపారుదల రంగంలో రక్షణలు అమలుకాలేదు. భూగర్భ జలాలు అడుగంటాయి. బోరు బావుల పాలైన వ్యవసాయం రైతుల ఆత్మహత్యలకు కారణమైంది.

తొమ్మిదేండ్లలోనే ఎంత మార్పు?..

తెలంగాణ వచ్చింది. దేవుని దయ వల్ల కాంగ్రెస్ కాకుండా టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. కేవలం తొమ్మిదేండ్లకే ఈ రోజు వరి పంట రికార్డు స్థాయిలో వచ్చింది. దీనికి కారణం ఏమిటో కాంగ్రెస్ చెప్పాలి. నీటి వసతి ఉన్న వ్యవసాయ భూముల విస్తీర్ణం 117 శాతం పెరిగింది. 62.48 లక్షల ఎకరాల నుంచి 135 లక్షల ఎకరాలకు పెరిగింది. 2014-15 నాటి వరి పంట 45.71 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి, ప్రస్తుతం 202 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది. ఇదంతా ఎట్లా సాధ్యమైందో కాంగ్రెస్ లేక బీజేపీ జవాబు చెప్పాలి. కానీ ఆ దబాయింపు సెక్షన్‌కు ఈ అభివృద్ధి పట్టదు. అభివృద్ధి కోణం ప్రజాకోణం అనేది ఆ పార్టీల డీఎన్ఏలో మచ్చుకు కూడా లేదు.

60 ఏండ్ల ద్రోహ చరిత 4

వారిది పల్లేర్లు మొలిపించిన పాలన

> తెలంగాణ ఏర్పడకముందు నీటిపారుదల రంగంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏం చేశాయో పరిశీలిస్తే కానీ, ఈ ద్రోహం అర్థం కాదు. వారి పాలనలో చెరువుల్లో ఇసుక మేట వేసి పొలాలు బీళ్లు పడ్డాయి. చెరువులు ఎండటంతో భూగర్భ జలాలు కూడా అడుగంటి ఒకప్పుడు ఊరూరా ఉన్న మోట బావులు, రాట్నం బావులు, దిగుడు బావులు అన్నీ ఎండి పోయాయి.

'పల్లే పల్లెనా పల్లేర్లు మొలిసే నా పాలమూరు లోనా.. మన తెలంగాణలోనా' అని పాడుకున్న దైన్యానికి కారణమెవరు? కృష్ణా నదీ జలాలు తరలించుకుపోయినప్పుడు కిమ్మనకుండా ఉన్నదెవ్వరు? కృష్ణా నది తడపకపోవటంతో నల్గొండలో పెరిగిన ఫ్లోరోసిస్‌కు కారణమెవరు? ఈ ప్రశ్నలన్నింటికీ జవాబుగా ఎవరి చూపుడువేలైనా తిరిగేది కాంగ్రెస్ వైపే.

సాగరమంత మోసం

1930లో హైదరాబాద్ ప్రభుత్వం, చీఫ్ ఇంజినీర్ నవాబ్ అలీ నవాజ్‌జంగ్ ఆధ్వర్యంలో కృష్ణానదిపై ఏలేశ్వరం దగ్గర ప్రాజెక్టు కట్టి తెలంగాణకు నీళ్లివ్వాలని పథకాలను సిద్ధం చేసింది. కానీ, ఆంధ్రాలోని నందిగామ వాసి, ప్రణాళికా సంఘం సభ్యుడు కే.ఎల్.రావు ప్రాజెక్టును ఏలేశ్వరం నుంచి నందికొండకు మార్పించడంతో నాగార్జునసాగర్ పేరిట తెలంగాణకు జరిగిన మోసం

మొదలై చాలా ఏండ్లు కొనసాగింది. 1954లోనే ఈ మోసం జరిగినా, ఆప్షాల్ ఓ అధికారి ఇంతమంది కండ్లు గప్పి మోసం చేస్తున్నా... మన కాంగ్రెస్ పాలకులకు అర్థం కాలేదు. ఆంధ్రా-హైదరాబాద్ జాయింట్ ప్రాజెక్టు రిపోర్టు ప్రకారం తెలంగాణకు ఎత్తిపోతలు అంటే లిఫ్టుల ద్వారా సాగునీరు అందించాల్సిన విషయం 1969 వరకు గుర్తుకురాలేదు. ఆ తర్వాత రకరకాల కారణాలతో అసలు లిఫ్టులే ఏర్పాటు కాలేదు. చివరికి తెలంగాణలో ఆయకట్టును తగ్గించడం, తెలంగాణకు నీరందించే ఎడమ కాలువలో బెడ్ లెవెల్ తగ్గించడం, ప్రవాహం కంటే ఎక్కువ ఎత్తులో తూములను కట్టడం వంటి మోసపూరితమైన విధానాలను ఒక్క నేతా ప్రశ్నించలేదు. సచివాలయంలో సీట్లు, జేబుల్లో నోట్లు వారిని మాట్లాడనివ్వలేదు.

జల విజ్ఞానం లేని నేతలు...

1954లో బూర్గుల రామకృష్ణారావు నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మోసాన్ని అర్థం చేసుకోలేకపోయిందనుకుంటే, 1971లో నాగార్జునసాగర్ పూర్తయేంత వరకు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు కూడా ఎందుకు పట్టించుకోలేదన్నదానికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్ మీదే ఉన్నది. ఇప్పుడు నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకత్వం దీనికి జవాబు చెప్పాలి. అసలు జలవిజ్ఞానం లేని నాయకులు తెలంగాణకు ప్రాతినిధ్యం వహించడం ఈ ప్రాంత దౌర్భాగ్యం. నాగార్జునసాగర్ విషయంలో ఎన్నిరకాల వివక్ష జరిగిందంటే, కృష్ణా తీరంలో తెలంగాణ వైపు ముంపునకు గురైన 47 గ్రామాల్లో చారిత్రక ఆధారాల కోసం సమగ్ర సర్వే కూడా చేయలేదు. 1954 నుంచి 1956 వరకు నాగార్జునసాగర్ జలాశయంలో మునిగిపోనున్న ఏలేశ్వరంలో మాత్రమే తవ్వకాలు జరిగాయి. ఇక 1956 తర్వాత సర్వే చేయలేదు. అందుకే నాగార్జునసాగర్‌లో మునిగిన ప్రాంతాల్లో ఒక్క ఏలేశ్వరం తప్ప మిగతా అన్ని గ్రామాలు తన చరిత్రను గర్భంలోనే దాచేసుకొని నీట మునిగాయి. ఇక్ష్వాకుల చరిత్ర కృష్ణకు రెండు వైపులా ఉన్నా ఆంధ్రా వైపు పథకం ప్రకారం తవ్వకాలు జరిగి నాగార్జున కొండ మీద కొలువై చారిత్రక వారసత్వంగా మిగిలింది. కానీ, తెలంగాణ వైపు చరిత్ర నాగార్జున సాగర గర్భంలో శాశ్వతంగా నిమజ్జనమై పోయింది.

పాలమూరు వెతల కారకులెవరు?

అప్పర్ కృష్ణా, భీమా ప్రాజెక్టులు, తుంగభద్ర కాల్వల నిర్మాణం కోసం నిజాం ప్రభుత్వం నుంచి 1951లో వెల్లోడి నేతృత్వంలోని సివిల్ గవర్నమెంట్ వరకు పథకాలు వేసి, చివరికి కేటాయింపులు కూడా సాధించినా, ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుతో అన్ని పథకాలు అటకెక్కినాయి. దీనికి కారణం నీలం సంజీవరెడ్డి. చరిత్ర మొత్తంలో తెలంగాణేతర కాంగ్రెస్ నాయకుల అక్రమాలకూ, దాష్టీకాలకు తెలంగాణ నాయకులు ఆక్షేపణను తెలపడం అటుంచి, వారి అడుగులకు మడుగులొత్తినారనే చెప్పాలి. అందుకే మలిదశ ఉద్యమకాలంలో రాజోలిబండపై బాంబులు వేస్తైనా రాయలసీమకు నీళ్లు తీసుకుపోతామని అంటే తెలంగాణ ఉద్యమకారులే ఎదిరించారు కానీ ఒక్క కాంగ్రెస్ నాయకుడూ చాలెంజ్ చేయలేదు. గోదావరి మీద కూడా ఇచ్చంపల్లి, పెన్‌గంగ, దేవనూరు, ప్రాణహిత ప్రాజెక్టులను ఆపేసి, పోచంపాడును కుదించిన వాడు నీలం సంజీవరెడ్డి. ఒకవైపు ఆంధ్రా కాంగ్రెస్ నాయకులు కుట్రలతో అన్యాయం చేస్తే, తెలంగాణ కాంగ్రెస్ నాయకులు తమ చేతగానితనంతో ఆంధ్రా ముఖ్యమంత్రుల కరుణ కటాక్షాల కోసం వెంపర్లాడారు. అందుకు ఉదాహరణ తెలంగాణకు చెందిన మంత్రులే భారీ నీటి పారుదల శాఖ ఎక్కువ కాలం నిర్వహించినప్పటికీ తెలంగాణ నేల నీటికి నోచుకోలేదు.

వినపడని చెరువుల గోస..

చిన్న నీటి పారుదలకు తక్కువ కేటాయింపులిచ్చి తెలంగాణలో చెరువులను మేట వేసేలా, ఎండిపోయేలా చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలది. స్వరాష్ట్రం సాధించుకున్న తర్వాత మిషన్ కాకతీయ చేపట్టి చెరువులను పునరుద్ధరించారా లేదా చెప్పాలి. చెరువులు ఎండితే భూగర్భ జలాలు కూడా అడుగంటాయి. ఇప్పుడు తెలంగాణలో పెరిగిన భూగర్భ జలాలకు కారణం ఈ మిషన్ కాకతీయ కంట్రిబ్యూషన్ ఎంతో ఉన్నది.

పచ్చని తెలంగాణ చెపుతున్న సాక్ష్యం

> కేసీఆర్ ఒక్క ఎకరానికైనా నీళ్లిచ్చిండా? అని బహిరంగసభల్లో అడిగించుకొని ఓట్లడుగుతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులకు పల్లెలే సాక్ష్యం చెప్తాయి. ఇంతకుముందు ఉత్తర తెలంగాణలో జొన్నలు మాత్రమే పండే భూముల్లో ఇప్పుడు నీటి వసతి ఎంత వచ్చిందంటే ఇప్పుడు ఆ జొన్నలు పండించడమే కష్టంగా మారింది.

కేవలం రెండు, మూడు నెలలు నిండి ఉండే చెరువులు ఇప్పుడు ఏడాది పొడుగునా నీళ్లతో ఉండటం ఒక సంతోషకరమైన దృశ్యం కాదా? ఇంతకుమునుపు వానలు పడినప్పుడే పొంగి చప్పబడే ఏరులు ఇప్పుడు కనీసం ఆరు నెలల పాటు చెరువులకు, నదులకు మధ్య సజీవ సంబంధంగా ప్రవహిస్తున్న దృశ్యం నిజం కాదా? ఎన్నికల కాలంలో కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని అసత్య ఆరోపణల